"నేను ఎవరనుకున్నావు ? రాక్షిల్లరా ?" నవ్వింది.

"రా, నాదగ్గిర మూడువందల రూపాయలు కాదు ఒక్క——"

"ఏమీ యివ్వవద్దు రా."

"నిజమా, నిజమా? వొస్తాను. మహారాజులాగ వస్తాను" అని వెళ్ళిపోయినాను.

ఈ అదృష్టం నిజమా ? నిజమా ? కలా ? సర్కస్ ఆవూరి నించి వెళ్ళిందాకా ప్రతిరాత్రీ వెళ్ళాను. స్నానం భోజనం అంతా అక్కడే. పరిక్షా ? అడుగుతున్నావా ? పరీక్ష ఏమయింది ? రామేశ్వరంలో పూజలు సరిగా జరుగుతున్నాయా ? భూమి సూర్యుడుచుట్టూ తిరుగుతోందా ? మానేసిందా ? ఈ కుంటి ప్రశ్నలు నాకెందుకు ?

చుక్క

(నార్వేజియన్ నావెల్ నించి)

౧

అమరావతి యింకా మూడుమైళ్ళుంది. వొడ్డున వరసగా చేలూ, అక్కడక్కడ చెట్ల గుబుర్లూ తప్ప యింకేమి లేవు. చక్కని గాలి వుండడంవల్ల ఆ వుదయం పడవ నీళ్ళమీద తేలి పోతోంది. యెండ తెరచాపమీద యిటూఅటూ ఆడుతోంది. గట్టుదగ్గిరగా పడవ నడుస్తోంది. ఒకదిబ్బ మలుపు తిరిగాము.

చిన్న తోటా, పొలము, ఆమధ్య గుడిశా కనపడ్డాయి. ఒక ఫర్లాంగు దూరములో ఏదో పల్లెవున్నట్టుంది, గాని కనపట్టం లేదు. మా పడవ దగ్గిరికి రాగానే గుడిశలోంచి వొకామె వొడ్డుకి పరుగెత్తుకొచ్చింది. పైటకొంగు విసురుతో మమ్మల్ని కేకేసింది. వెనక యిద్దరు పిల్లలువొచ్చి మాపడవని నిదానంగా కళ్లువిప్పి చూస్తున్నారు. ఆమెకి చీరెతప్ప, రవికకూడా లేదు. ఆ చీరెని చూస్తేనే ఆమె బీదతనం తెలుస్తోంది.

“అన్నా ! కాస్త వొడ్డుకి పట్టండి.”

“యెందుకు ?” అని చుక్కాని పట్టుకొని, తన చుట్టపొగ శక్తితో పడవని నడుపుతున్నట్టు కూచున్న మా సరంగు కేకేశాడు.

“నా గేదె గోతులోపడ్డది. అన్నా అన్నా, ఒకచెయ్యి సాయం పట్టి పైకితీసి పోదురూ, మీ కెంతన్నా పుణ్యముం టుంది.”

“వూళ్లోవాళ్ళని రమ్మను ! మాపడవకి అదేపనా ?”

“గోతులోపడ్డ గేదెల్ని లేవదీస్తోవ్వుంటే బాగానే చేరు కుంటాము బెజవాడ” అన్నాడు మా వర్తకుడు. అతనికి బహు తొందరగావుంది ప్రయాణం మొదటినుంచీకూడా.

“వూళ్లోవాళ్ళు మా పొలానికిరారు. రెండురోజుల్నించి అరుస్తోంది, నాయనా అది చస్తే యింక యీ బిడ్డలిద్దరూ చావలసిందే.

“పాపం ! ఆడది, వొంటరిది ఆమాత్రం సహాయం చెయ్య రాదుటోయ్” అన్నాడు సర్వభద్రం.

“మీకేం చెబుతారు; ఆ గేదెని యెవరెత్తుతారు ? మొదలు పెట్టామంటే వొదులుతుందా ? గడ్డివాము వెయ్యమంటుంది,

యిల్లు కష్టమంటుంది. కూలియియ్యకుండా పని చేయించుకునే మెత్తు."

"చూడు వాళ్ల కఠినత్వం, సుబ్రమణ్యం!" అన్నాడు సర్వభద్రం.

"నిర్దయ కాదు, వాళ్లనేమాట నిజమే. ఈ ఆడ వాళ్లు దొంగలు. నేను చాలాచూశాను యిట్లాంటి టక్కరివేషాలు."

"ఎప్పుడూ నువ్వు అట్లానే అంటావు. చూడు యెట్లా అరుస్తోందో! ఆమెకళ్లల్లో దీనత్వం చూస్తే జాలి వెయ్యదూ! చూడు, ఆ అరుపు ఎంత నిస్సహాయంగావుందో! పోనీ, ఆ పిల్లలో, వాళ్లు అమాయకులు కారూ?"

"కళ్లల్లో దీనత్వం! ఆడదానికి చూపులకి హృదయంలో దీనత్వం వుండనక్కర్లేదు. అసహాయమంటావా, ఆ అసహాయత్వం వల్లనే అవసరంలేని సహాయమంతా పొందుతారు. పైగా యీ మొగాళ్లు మమ్మల్ని అధోగతిలో వుంచారని మీటింగులు. నాకు చెప్పకు యీ ఆడవాళ్ళసంగతి."

"ఈ పొలాల్లోవాళ్లు కాదుకదా ఆ మీటింగులు చేసేది?"

"వాళ్ళవెనక వీళ్ళూ మొదలు పెడతారు."

"అన్నా నీ కడుపున పుడతా, నా గేదెని బతికించు. నా పిల్లలన్యాయంగా మాడి చచ్చిపోతారు. వెళ్ళిపోకు నాయనా. నీకు కూలికి ధాన్యమిచ్చుకుంటా పోనీ."

సరంగు చెవుల్లో సీసం పోసుకున్నట్టున్నాడు. ఆమె ఆర్తనాదం, సుబ్రమణ్యానికి సంగీతం లాగుంది. వర్తకుడు పడవని, తన తొందరతో నట్టేట్లోకి నెట్టాలని చూస్తున్నాడు.

"ఛూ! యేట్లో దూకి యీదుకునన్నా పోతాను." అన్నాడు సర్వభద్రం.

బస్తామీద జార్లబడి స్త్రీలను ద్వేషించే సుబ్రహ్మణ్యాం యేమను కున్నాడో యేమో; చప్పున కూచుని గట్టువంక చూశాడు. "ఇదిగో సరంగూ! నేనిక్కడ దిగతలుచుకున్నాను. ఒడ్డుకిపట్టు" అన్నాడు తటాలున.

"ఇక్కడా, బెజవాడ వెడతా నన్నారే!"

"వెళ్ళను."

సుబ్రహ్మణ్యాన్ని చూస్తే వాళ్ళకి భయం. వాడి పెద్దగొంతూ, వాడి డబ్బు నిర్లక్ష్యమూ.

"ఏంపిచ్చి అయ్యా! సరేపదండి కాని నేనుమాత్రం గేదెను మోసేది వుత్తది." అని పడవని వొడ్డుకిపట్టాడు.

"మేము పోతాం" అన్నాడు యింకోడు

"ఏమయ్యా ఎవరూ రారా సహాయం?" అన్నాడు సుబ్రమణ్యాం. ఇంకోడు దిగాడు మాతో.

"ఇదిగో నలుగురం దిగాము. పడవవాళ్ళూ, మీరు మాతో వస్తే ఐదు నిముషాల్లో ఆగేదెని బైటపడేసి వస్తాం. కాకపోతే మమ్మల్ని వదులుకుపొండి." దాంతో పడవవాళ్ళ కాపీనం జయించింది. అందరూ నడిచారు. గొయ్యి చాలా పెద్దది. అడుగున ఏముందో కనపడదు. చుట్టూ చెట్లు పెరిగాయి. మోకులు తీసుకొచ్చాము. కాని గేదెకి కట్టడమెట్లా? "యిది సాధ్యమయ్యే పనికాదయ్యా, పోదాం రండి."

అసాధ్యంగానే వుంది. కాని యేదో మొగాడివల్లే వచ్చి వెనక్కి పోవడం, యిద్దరు పిల్లల్నీ, ఆ కన్నీళ్ళతో చూసే ఆడదాన్ని వొదిలి. సర్వభద్రం చొక్కా తీస్తున్నాడు.

"ఏమిటది?"

"నేను దిగుతాను."

“వొద్దు, నాయనా. పోనీలెండి గేదెపోతే—“అంది” చుక్కమ్మ.

సర్వభద్రం మాట్లాడలేదు. మోకుతో అతన్ని దించారు. గేదెకి కట్టారు. గేదెని లాగారు. అతను పైకి వచ్చేటప్పటికి వొళ్ళంతా బురద.

“పదండి.”

“మీ వొళ్ళు, రండి బావినీళ్ళర స్నానంచేద్దురు గాని.”

అతని ప్రాణంకోసమూ, గేదె ప్రాణంకోసమూ, ఆ కళ్ళల్లో ప్పుడే వీడుతున్న అభయమూ, విచారమూ! అందరూ నడుస్తున్నారు పడవవేపు.

“నదిలో స్నానంచేస్తాను.”

“వొద్దు, బురదనీళ్ళు, ఇక్కడేచెయ్యండి. పిండియిస్తాను.”

ఆ ప్రార్థన విని నిరాకరించలేక పోయినాడు సర్వభద్రం.

“వాళ్ళనికూడా పిలవండి” అంది——కేకేశాడు.

“ఆ, నేను చెప్పలా, యింకేమిటి? ఇల్లు కురుస్తోందా” అంటూ వచ్చాడు సరంగు.

“రండి, లోపలికి రండి.” అంటోంది. సర్వభద్రం స్నానం చేస్తున్నాడు. తుడుచుకోడానికి బట్టయిచ్చింది, దొడ్లోకివెళ్ళి ఆమె కళ్ళల్లో ఎంతసిగ్గు, ఎంత కృతజ్ఞత! ఈ పల్లెటూరివాళ్ళ మొహాల్లో ఎంత మాధుర్యం వుంటుందో!

అతను లోపలికి వచ్చేటప్పటికి, అందరూ కూచుని పాలు తాగుతున్నారు.

అతనికీ యిచ్చింది. కాని అవి సగము మీగడా, సగంపాలూ

“ఎంత మీగడో!” అన్నాడు.

“ఆహా యీ పాలల్లో ఒక్క తెరకాలేదు. మీగడ పా

పైన తేలడం చూశాంగాని, అడుగున మునగడం చూళ్ళే దక్కడా—"

"గోతిలో దిగినందుకు అంతమాత్రమైనా లాభం లేక పోతే—"

"మీ మొగాళ్ళేమయినారమ్మా ?"

"ఆయన తూర్పు పోయినారు."

"ఎందుకు ? ఇంకో గేదెని కొనుక్కురావడానికా ?"

"జరక్క."

"పొలమూ, గొడ్డూ, బాగానే కనబడుతున్నాయే !"

ఆమె మాట్లాడలేదు. ఎందుకో అతని హృదయములోంచి, అనురాగమూ, దయా—యెందుకో ఒక తేబాధ. ఆమెకి యిర్వై యేళ్ళకంటే యెక్కువ వుండవు. ఆమె వాళ్ళముందు తలవంచిన విధంలో ఏదో సమ్రతవుంది. కళ్ళలో దయా, ప్రేమ వుంది. జాలిగా చూస్తుంది. ఆభర్త యేమైనాడు ? యెందుకురాడు ?

"వూళ్ళో యెవరూ, నీకెందుకు తోడురారు ?"

"నేను వాళ్ళకేం తోడుపడగలను ? వూరికే చేస్తారా ?

"ఏమో విచిత్రంగా వుంది ! ఆడది కష్టంలోవుంటే ఒకడూ రాడా ? చిత్రమైన వూరే."

దానికి ఆమె మాట్లాడలేదు.

ఈమె వొక్కర్తా యీపొలంమధ్య యెట్లావుంటోంది ? వూరివాళ్ళ సహాయంలేక, యిరుగుపొరుగువాళ్ళులేక ! కారణ మేమిటో ! మూల వొక మగ్గమూ, రాటమూ, వున్నాయి—రంగునూళ్ళు దణ్ణాలకి వేళ్ళాడుతున్నాయి. ఆమె జీవనం చూస్తే తన గర్వమూ, అధికభావము అన్నీ మాయమైనట్టున్నాయి సర్వభద్రానికి. "ఏమి చేయగలను ఆమె కోసం ? ఇట్లాంటి

పొలం, తోటా వుండి—అటువంటిభార్య వుంటే ! ఇంక ఏం కావాలి . . .'' అనుకున్నాడు.

అందరూ లేచి వెడుతున్నారు. సర్వభద్రం చూడనేలేదు. ఇంకా పాలు తాగుతున్నాడు. వేడి చల్లారలేదో యేమో !

"అయ్యలారా ! దణ్ణాలు ! మీకెంతో పుణ్యముంటుంది.'' అని వాళ్లని పంపించి లోపలికివచ్చి సర్వభద్రం యెదురుగా కూచుంది.

సర్వభద్రం లేచి వెడుతున్నాడు.

"మీ దేవూరండి ?''

"మావూరా ! ఒకచోట నిలకడలేదు.''

మీపేరేమిటండి ?''

"నా పేరా, శేషయ్య. నీపేరూ ?''

"చుక్కమ్మ ''

"చుక్కమ్మా, చల్లగావుండు. పోయివస్తాను.''

సర్వభద్రం కాళ్లు కదలలేదు. ఆమె లోపలికి పోక ఏదో యింకా అడిగేట్టు నుంచుంది. అతనూ కదలలేదు. ఇద్దరూ కిందికి చూస్తూనుంచున్నారు. చేతులన్నా కదలలేదు. అట్లానే నుంచున్నారు. వాళ్ల హృదయభావాలు యెవరికి తెలుసు ? వాళ్ళకే తెలీదు. యవ్వనంతప్ప ఆ యిద్దరికీ యేం సంబంధం !

"వెడతాను.''—మాటాడడు . . . కదిలాడు. అందర్నీ కలుసుకున్నాడు.

"ఏమిచ్చింది నీకు యీ కాసేపట్లో రహస్యంగా ?'' అన్నాడు సుబ్రమణ్యం రహస్యంగా.

"అసలు రారనుకున్నాము.''

"మళ్ళీ గోతిలో దింపిందా ?''

"ఏంచేశారు, చెపుమా ?" అన్నాడు సుబ్రమణ్యం మళ్ళీ.

"ఏం లేదు. నోరుముయ్యి." అన్నాడు కోపంతో సర్వభద్రం.

"ఇంతేనా ? నేనైతేనా—"

పడవ కదిలింది.

"ఆమొగుడు ఏమైనాడంటావు ?" అన్నాడు ఒడ్డుననుంచున్న చుక్కమ్మకేసి చూస్తో సుబ్రమణ్యం.

"ఎవత్తెతోనో పోయినాడో! చచ్చాడో!" అన్నాడు సరంగు.

"ఒక్కత్తా అట్లా కష్టాలుపడుతూ యెందుకు వుందంటావు?" అన్నాడు ఇంకోడు.

"కర్మ. ఎందుకంటే ఏం చెప్పను ? అందమైన పిల్ల. కాని నే చూసిన వాళ్ళలో ఇదోటి లెఖ్ఖా !" అన్నాడు సుబ్రమణ్యం.

"నీ రేపల్లె రత్తమ్మకంటే బావుండలేదా ?" అన్నాడు సర్వభద్రం.

"అదా ! అది కుంభకర్ణుడి కూతురు. ఎక్కడ వుందో మళ్ళీ నాకు దొరికితేనా, అప్పుడు దానిపని తెలిసేది. పోదూ. అది నాకెందుకు, వొదిలి పోయిందేచాలు."

ఎవరికోసం, ఎందుకోసం, అట్లా, ఆవొడ్డునే నుంచుంది చుక్కమ్మ, ఆ చింతచెట్టు నీడని మధ్యాన్నందాకా—ప్రవహించే ఆనీళ్ళకేసి చూస్తో.

౨

రెండునెలలు దాటింది. మళ్ళీ అమరావతి దాటి పడవ సాగే సరికి మధ్యాన్నం మూడుగంటలయింది. నీళ్ళువిరిగి కొంచెం నీలమవుతున్నాయి. సాయంత్రపు గాలి మళ్ళింది. పడవ ప్రయాణం హాయిగా అనుభవిస్తున్నారు వున్న నలుగురూ.

సర్వభద్రం గట్టునే నిదానించి చింతచెట్టుకేసి చూస్తున్నాడు. పడవ వొడ్డుకు పట్టారు. తన చిన్నమూటా తానూ దిగి పడవని వెళ్ళిపొమ్మన్నాడు.

"ఇదేనా మీవూరు ?"

తలవూయించి గుడిశకేసి మళ్ళాడు. పడవని లోపలికి నెట్టేశారు. సర్వభద్రం చెట్టుపక్కన నుంచుని వెళ్ళేపడవకేసి చూస్తున్నాడు. పడవమీదివాళ్ళు అతనికేసి చూస్తున్నారు. మళ్ళీపడవని పిలిస్తే! తన వెఱ్ఱితనానికి తనే ఆశ్చర్యపడ్డాడు. ఎందుకు దిగినట్టు ? అసలు వాళ్ళు వున్నారో ? వెళ్ళిపోయినారో ! ఆ మొగుడు తిరిగి వచ్చివుంటే ! తనవంక కొత్తగా చూస్తే ఆమె ! పడవను మళ్ళీ కేకవేస్తే ! యేమైతేనేం, రేపు పడవలో పోవచ్చు. గుడిశవేపు మళ్ళీ తిరిగాడు. మెరిసే ఆబంగారు కాంతిలో ఆనందంగా కూచున్నట్టువున్నాయి ఆ గుడిశా, ఆచిన్ని పాకా, ఆ వానిమ్మచెట్టూ. యెవరో వస్తున్నారని చూసి తల్లీ పిల్లలూ గుమ్మంలో నుంచుని చూస్తున్నారు. అతను సమీపించగానే "ఇదేమిటి—" అని ఆగింది. అతను సంచీ దింపి—

"ఈవేపు వెడుతున్నాను. చూసివెడదామని దిగాను."

"నిజంగా మీరే! ఆవాళ ఎంత సహాయం చేశారు నాకు!" అని సంతోషంతో సిగ్గుపడ్డది.

"పడవలో వొచ్చారా ? వెళ్ళిపోయిందా ?"

"అవును వెళ్ళింతరవాత నాకు జ్ఞాపకమొచ్చింది. ఆ గుంటలో ఆగేదె పడితే చుక్కమ్మకియెవరు సాయంచేస్తారు? ఆ బావి చుట్టూ ఒకదడిగా కడితే బావుండేదే అనుకుని యిట్టా వెడుతో దిగాను."

"అంత ఆలోచించారా ! యీ బీదవాళ్ళనిగురించి ! నిజంగానా ?"

"పిల్లలకి యివి తీసుకొచ్చాను." అని తను బెజవాడలో కొన్న బండీ, కొరడా, టోపీ అవీ సంచిలోంచి తీసియిచ్చాడు. ఆ యక్షిణీ సంచిలోంచి యింకా యేమో తీస్తాడు అని వాళ్లు తొంగితొంగి ఆశ్చర్యంతో చూస్తున్నారు.

"లోపలికిరండి. మాది బీదవాళ్లయిల్లు."

మగ్గం మీదసగం నేస్తున్న బట్టవుంది.

"యిదే మా జీవనాధారం"

"చాలామంచిపని."

"ఈరంగు బాగుందా? యింతకన్నా సన్నని నేత నేయగలను. నేను"

"ఎట్లా నేర్చుకున్నావు?"

"నేర్చుకోడమా! మానాన్న నేసేవాడు. నాకు చిన్నప్పణ్ణించి చేతనవును"

పిల్లలు అతను యిచ్చిన వస్తువులతో ఆడుకుంటున్నారు. అతని చెల్లెళ్లకి, తమ్ములకీ ఇవ్వాలని కొన్న ఆటవస్తువులూ, బొమ్మలూ అవి.

"ఎంత దయవుందంటే మీకు మామీద! ——మీకు ఆకలేస్తోందా?"

"లేదు"

"వేస్తున్నా యింట్లో యేమీ లేదులెండి. అడగాలి కనక అడిగాను. అంతే! కొంచెం పెరుగువుంది తాగడానికి."

"అక్కర్లేదు."

"ఐతే రండి. మా పొలం చూద్దురుగాని. పిల్లలు ఆడుకొంటూ వుంటారు."

అతన్ని తీసికెళ్ళి పశువులపాకా, తన రెండు గేదెలూ

పెట్టుకున్నాడు ఆమెని. అట్లా జరిగింది అది. అతనామె నేమీ గొర్రెలూ, కోళ్లూ, చూపించింది. ఒకచోట ఆముదాలు, ఒక చోట చిన్న వరిమడి, పసుపు, వేరుశనగ, అన్ని పంటలూ కొంచెం కొంచెంగా మళ్ళువున్నాయి. గట్లపక్కన సీమచింత మొక్కల దగ్గర ఇద్దరూ ఆగారు.

ఒక్కొక్క మడిమీద యెంతపంట వొస్తుందో; అవి యెంతకి అమ్మవొచ్చో; తన నెట్లా ఆడదని మోసంచెయ్య చూస్తారో; తనే వాళ్లని ఎట్లా చివరికి మోసం చేస్తుందో నిదానంగా చెప్పింది—ఎట్లానన్నా అతనికి మనసులో తాను కొంతఆస్తి కలదానని తెలియచెయ్యాలని ఆ ప్రయత్నం. ఆ బాటసారి తననుగురించి యేమనుకుంటే ఆమెకేమో !

"నాయంత్రమవుతోంది. ఆడడి కట్టిస్తే నేనువచ్చిన పని అవుతుంది."

"అలిసి వొచ్చారు, యీవాళేంచేస్తారు ? రాత్రికి వుండండి. రేపుపొద్దున్నే కట్టవొచ్చు." అని వొకగుక్కలో అనేసింది. ఎందుకు? తనబిడియాన్ని దాచాలనా ?

"సరేలే, అట్లానే బావుంటుందేమో ! మధ్యాన్నానికల్లా కట్టేస్తాను. మరిరాత్రికి చోటుంటుందా నాకు ? బైట చలి యీ కాలంలో."

"ఎందుకు. ఆకొట్టంలో మంచంవేస్తాను. జములుదుప్పట్లున్నాయి. మంచంమీద పక్కేస్తాను. చలిలేకుండా యేమన్నా పైనకప్పుకోండి. నాచేత్తో నేశినవి."

ఇంటిగోడకి ఒకపటము వుంది.

"ఆయనేనా, యేమిటి, మీఆయన ?"

"ఆ, యీచుట్టుపక్కలకల్లా దర్జాపురుషుడు. అందరూ అదే

సర్వభద్రానికి ఆదర్శాన్వేమిటో ఆపటంలో కనబడలేదు.

"పుస్తకాలు యెంతబాగా చదువుతాడు! అమరావతి గుడిముందు ఒక్కసారి పురాణంకూడా చెప్పాడు. ఇదిగాక హరికథలు చెప్పగలడు. హార్మోనియం పెట్టెలేదూ, దాంటో కీర్తనలు వాయిస్తాడు."

"మొన్న నాతో రాలా సుబ్రహ్మణ్యం—అతను బాగా వాయించగలడు. అతను పూనా వెళ్లి నేర్చుకొచ్చాడు."

"ఆయన కోలాటం వెయ్యగలరు. కర్రతిప్పారంటే పాతిక మందిని నిలబెడతారు."

"ఆహా, నిజమే. ?"

"అవును. పాతికమందేమిటి? నలభై మందికూడా పారిపోవలసిందే."

"అమ్మో, చాలా కష్టమే"

"ఆయనపాటకూడా బలేపాడేవాడు. అందరూ ఒకటే పిలుచుకుపొయ్యేవాళ్లు—కాని యేంలాభం? వాళ్ళతోకలిసి తాగుడలవాటయింది. ప్రతివాళ్లకి ఆయనంటే యిష్టమయ్యేను."

"మరిరాడేం ?"

"ఏమో యెంత దూరాన వున్నాడో! ఏంచేస్తున్నాడో!"

"మరి వుత్తరం రాయడేం ?"

"ఆయనరకమే అంత. అందరిమోస్తరుమనిషి ఐతేనా? వెళ్లేప్పు డన్నారు—'ఏదన్నా వ్రాయవలసినంత విశేషం తటస్థిస్తే—నాకేగొప్ప అదృష్టంపడితే వ్రాస్తాను. లేకపోతే లేదు—నువ్వేమీ బెంగ పెట్టుకోకు' అని."

"ఏమిటి? అతను దేశాంతరాలు తిరుగుతో వుంటే, నువ్వూ పిల్లలూ యెట్లా బతుకుతారనుకున్నాడు ?"

"ఏమాలోచించాగో తెలీదుకాని, నాకు నేత చాతనవునా, యీపంటలున్నాయా—ఎట్లాగో వోలాగు గడుస్తుందని తెలుసు ఆయనకి ! అదిగాక ఆయన వున్నప్పుడూ, అట్టేపని చేసేవాడా? సంపాయించేవాడా ? ఆటలు, పాటలు, హరికథలతోనే సరి పొయ్యేది. అందరూ ఆయన్ని పిలుచుకు పొయ్యేవాళ్ళే !"

ఇట్టా కూచుని యీయిద్దరు చిన్నవాళ్లూ సంభాషిస్తారు. వాళ్ళ మాటలు యెవరువిన్నా బాధలేదు—యేమీ దుర్మార్గంలేదు వాళ్లమనస్సుల్లో.

రాత్రి కొట్టంలో చుక్కమ్మ అతనికి పక్కవేస్తోంది. కొత్త జములు దుప్పట్లు అతను బుజాన పెట్టుకొని వెళ్లాడు. శుభ్రంగా వూడ్చింది. నీళ్లు చల్లింది. మంచమూ దుప్పట్లూ దులిపింది. తలకిందయెత్తు, మంచినీళ్లు—అన్నీ తల్లివలె దయతో యేర్పాటు చేసింది. యేర్పాటుచేస్తో మధ్యమధ్య యిద్దరూ కులాసాగా నవ్వుతారు, యే అదుర్దా, వ్యసనమూ, వికారమూ లేకుండా. కాని అప్పుడప్పుడు ఆమె మౌనంగా తలవాల్చి, అతను మాట్లాడుతో వుంటే, అతని ముఖంవంక చూడకుండా వింటుండేది.

పక్కవేసి ఆమె వెడుతూవుంటే అతను వెనకనే వెళ్లాడు. ఆమెని వెళ్ళనియ్యడం అతని స్వాధీనంలో లేనట్టుంది. ఆమె మీద ప్రేమ అంత అధికమయింది. పొడిపొడి మాటలతో తడబడే వాక్యాలతో, సిగ్గుతో, తన హృదయంలో రహస్యం ఆమెకి తెలిసేటట్టు చేశాడు. ఆమె చేతిని మెల్లగా పట్టుకున్నప్పుడు ఆమె అతన్ని అపార్థం చేసుకోలేదు. తల వూయించి మృదువుగా నవ్వింది. చిన్నవాడు—ఇంకా కుర్రాడు—అందమైనవాడు—బాల్యం నుంచి కాయకష్టంచేసి బతికిన మోటవాడు—అతని లాలన ఆమె అంగీకరించింది. అతనితో బైటికి

వెళ్లి, తిరుగుతో కిటికీలోంచి యింటిలోపలికి చూసింది. పిల్లలు సుఖంగా నిద్రపోతున్నారుకద. నిద్దట్లో దుప్పట్లని తన్నేసుకో లేదుకద.

"రండి లోపలకూచుని మాట్లాడుకుందాము. నిద్రవొచ్చిందాకా."

కాని వాళ్ళిద్దరూ మాట్లాడుతోవుంటే పిల్లలువూరికే కదులుతున్నారు. ఆకొత్త కంఠశబ్దాలు రాత్రులు వినడం వాళ్ళకు అలవాటులేదు. ఆడపిల్ల లేచింది. "యేమిటిఅమ్మా?" అంది.

ఏంలేదు నిద్రపో."

అక్కడకూచుని మాట్లాడుతోవుంటే పిల్లలకు నిద్రపట్టదు. తలుపుతీసుకొని కొట్టంలోకి వెళ్ళారు. కాని యేమీ జరుగలేదు. తను బెజవాడ వెళ్లివచ్చిన యీనెలదినాలూ ప్రతినిముషమూ ఆమెనే తలుచుకుంటున్నానని అతను ఆమె కళ్ళల్లోకి చూస్తో చెపుతో వున్నంతసేపూ ఒకరిచేతులు ఒకరు — వేళ్లువేళ్ళలో కలిపి కూర్చున్నారు. పిల్లతనపుచేష్టలు! వెర్రిమనుషులు! కాని ఆనిమిషాలు యిద్దరికి యెంత మధురంగా వున్నాయి! అప్పుడప్పుడు అతను యెండిపొయ్యే తన పెదవుల్ని, నాలికనూ తడి చేసుకుంటున్నాడు. తనకళ్ళనెత్తి ఆమెనుచూడ్డం అతని కసాధ్యమైనట్లయింది. అతనిగుండె గాఢంగా కొట్టుకుంటోంది. తనకి తానే ధైర్యం తెచ్చుకోడానికి బొంగురు కంఠంతో "హుం" అంటోవుంటాడు. కాని అతనంత తొందరపడడం అనవసరమేమో! యెదురుగా కూచుని చిరునవ్వుతో వింటోంది అతని మాటలు. ఆమెకికూడా అతనిమీద మమతలాగేవుంది. అట్లానే కనపడ్డది—ఎందుకంటే వెళ్ళిపొయ్యేటప్పుడు అతన్ని ముద్దుపెట్టుకోనిచ్చింది. మరిచూశారా ఆ సంగతి! అతను ముద్దు

పెట్టుకున్నాడు ఆమెని. అట్లాజరిగింది అది. అతనామె నేమీ అడగలేదు. వాళ్ళపెదవులు కలుసుకున్నాయి. ఆమె వెళ్లగానే, జములు దుప్పట్లోకంద బాగాకప్పుకుని, ముడుచుకుని, ముసుగు పెట్టుకుని పడుకున్నాడు. తనహృదయంలోని మధురమైన రహస్యాన్ని లోకంనించి దాచుకోవాలని గావుల్ను అతనివుద్దేశ్యం!

మర్నాడురాత్రినించి కొట్టంలోనే కూచుని మాట్లాడుకునేవారు. ఇంటోసింహాలు లేవరా, మరి! మాట్లాడుకోడానికి సంగతులు అంతంలేకుండా వుండేవి. విసుకు విరామములేదు ఆ కబుర్లకి యేదోవొకటి కొత్తగా తోస్తూనే వుండేది. మళ్ళీతాను ఆమెదగ్గిరికి రావడానికై యెన్నికష్టాలు పడ్డాడో అతనుచెప్పాడు. తమపడవలోంచి గుడిశదాపున దిగుతానన్నప్పుడు పడవలో ఒకతను—'అవును, సీనయ్య తోటదగ్గిరా' అన్నాట్ట! 'సీనయ్యా! నే నెరుగుదును అతన్ని' అని ఇంకోడు అన్నాడని చెప్పాడు.

"అవును ఆయన పేరదే! చూశారా! ప్రతివాడికి తెలుసు ఆయన! ఈచుట్టుప్రక్కలంతా ఆయనంటే ప్రాణమిస్తారు."

"సీనయ్యా మీఆయన! కైదులో వున్నాడన్నారు!"

"అయితే ఆయనకాదు — ఆపేరాయన యింకెవరో!"

"రాజమండ్రి జైలులోట."

"కాదుకాదు—ఆయనకాదు—ఎవరిసంగతో.

"మొదట నేను యీ గుడిశెని యెట్లా గుర్తుపట్టగలనా అని సందేహపడ్డాను. తీరా దాటిపోతే! చివరికి నువ్వు చూస్తూనుంచున్నావే — ఆ చింతచెట్టు జ్ఞాపకమొచ్చింది. అదిగాక యింత చక్కనితోట యీ చుట్టుప్రక్కలలేదు."

"మీరూ అట్లానే అంటున్నారా? నే నెప్పుడూ అనుకుంటాను యింత అందమైనపొలం యీ పక్కనే లేదని."

"ఎప్పటికీ నాకిక్కడనే వుండాలనిపిస్తోంది."

"నాకూ అట్లానేవుంది కాని—"

సాయంత్రమైనప్పుడు యీ ప్రకారం మాట్లాడుకుంటూ వుంటారు. ఉదయం యెవరిపనిమీద వారుంటారు. ఆమె నేతా, అతను పొలంపనీ. వారమైంది అతను వొచ్చి. బావికి దడికట్టడం పూర్తిఅయింది. కాని పాపం ఆడది యేపనీ సరిగాచేసుకోలేక వొదిలిపెట్టింది. బలంగల మొగాడు చెయ్యవలసిన పనులు అక్కడ చాలా కనపడ్డాయి. దళ్లుకట్టాడు, గట్టువేశాడు, తవ్వటం పెట్టాడు. పొలం నిండా రాళ్లున్నాయి. అతని వొక్కడికీ సాధ్యమయ్యేపని కాదంది చుక్కమ్మ "ఒక గడ్డపలుగు తెద్దూ, చూస్తాను." అన్నాడతను.

ఇట్లా ఎన్నో విషయాలున్నాయి వాళ్లకి మాట్లాడుకోడానికి. గడ్డపార లేదు—ఎక్కణ్ణించో యెరువు తెచ్చుకోవాలి యెవరి దగ్గరవుంది ? వాళ్ళిస్తారా ? పోనీ కొనడానికి యెక్కడ దొరుకుతుంది ? ఎంతఖరీదుంటుంది ? గుంటూరులో గాని దొరకదు. చుక్కమ్మ గుంటూరు నెలకోసారే వెళుతుందిట—అంతే. ఈ అనురావతిలోను, అక్కడా గడ్డపారలమ్మరు. రాళ్ళు మాత్రం వున్నాయి. ఇట్లా వొకటే మాట్లాడుతారు.

లావాటి కర్రతీసుకుని దాన్ని చెక్కి కొయ్య గడ్డపలుగు తయారు చేసుకున్నాడు. ఒక్కొక్క రాయే తవ్వి దూరంగా పారేసి, ఆ గుంట్లని మన్నుతో పూడ్చాడు. ఒక్కొక్కరాయి నెత్తడానికి అతని బలంచాలదు. గునపం చివర యిద్దరు పిల్లలూ వేళ్లాడతారు. చుక్కమ్మకూడా కిందికిలోస్తుంది. ఇట్లా పొలం బాగుచెయ్యడం ఆ లేయెండలో, ఆ చల్లని గాలిలో, కష్టపడడం యెంతో ఆనందంగావుంది ఆ నలుగురికీ కూడా ! ఓ కుటుంబం

వాళ్ళు సొంతపొలం బాగుచేసు కున్నట్టుగానేవుంది. సాయంత్రం కడవలలో నీళ్ళు ముంచి, ఊగే మొక్కలకి మళ్ళల్లో ఎండలో యెర్రనైన నీళ్ళని పోస్తో నవ్వుతారు. మధ్యాన్నం భోజనమైన తరువాతైనా పడుకోడు. వెళ్ళి పనిచేస్తానంటాడు. భోజనం యేముందా — అన్నం, దోసకాయిపప్పు, పెరుగు, బలమైన భోజనం. ఇంకా యేమీ దొరకవే, అని దిగులు పడుతుంది చుక్కమ్మ. ఆ గాలిని పీల్చడమే అదృష్టం. ఆనీళ్ళని తాగడమే గొప్ప. తన భోజన విషయమై ఆమె అంత శ్రద్ధచూపి ఆదుర్దా పడడం, తననికూడా కుటుంబంలో ఒకడిగా అన్ని పనులలోను కలుపుకోడం, భార్యాభర్తలైనట్టుగానే ప్రవర్తించడం, అతనికి చాలా సంతోషంగావుంది. దారం చిక్కుతియ్యా మంటుంది. సామాను గదిలో కదుళ్ళకోసం పోయి, తాను తన తల్లికియ్యా లని తెచ్చిన పట్టంచు చీరెని సంచీలోంచితీసి నూలు దణ్ణెంమీద వేసి మాట్లాడకుండా వొచ్చి కూచున్నాడు.

"నేను గుంటూరు వెడుతున్నాను."

"ఏమిటి ! వెళ్ళిపోతున్నారా ?" అని శ్వాస ఆపింది.

"కాదు కాదు. ఓసారి వెళ్ళిరావాలి, కొంచెం పనివుంది. పనిలోపని గడ్డపారకూడా తెస్తాను. ఈ కొయ్యతో యింక పెద్ద రాళ్ళు కదలవు" ఆమె శాంతంగా వూపిరిపీల్చింది.

"అసలు వెళ్ళిపోతున్నారను భయపడ్డాను."

అతనునవ్వి—"నువ్వు తరిమేసిందాకా యిక్కడే వేళ్ళాడు తాను."

దిగులుగా తలవూయించి మాట్లాడకుండా కూచుంది.

చప్పున లేచి "నేను తోవచూపిస్తాను రండి. రాత్రికి అక్కడే వుండండి; రేపు ప్రొద్దున రండి." అంది. గుట్ట యెక్కారు.

సూర్యుడు మండుతున్నా చలికాలం కావడంచేత బాధకరంగా లేదు.

“అదేదోవ సరాసరి వెళ్ళండి.”

ఆమెకాళ్ళ కేమీ లేవు ! ఆ చీరతప్ప ఒంటిమీద ఏమీ లేదు. కాని ఆమెత్తు యెక్కడంలో ఆమె బుజాలమీద చిన్న చెమటబొట్లు—ఆమె ఆయాసంవల్ల ముక్కులు తెరిచి, కళ్ళు వాల్చి—యెంత అందంగా వుంది ! ఏమంచి చీరలూ జాకెట్లు వేసుకోకపోతేనేం. అవ్వి లేవనే దిగులులేదే ఆమెకి !

“అమరావతిలో ఆ పోష్టాఫీసు పంతుల్ని అడగండి. నా కేమన్నా వుత్తరం వుండేమో.”

మర్నాడు మధ్యాన్నమయింది. అతను యింకా రాలేదు. అతని బట్టలువుతికి ఆరేసింది. మడిచి చక్కగా పెట్టింది. వొస్తూ వుండాలి యీపాటికి. ఆగదిలో దణ్ణెంమీద విలువగల చీరె వేసి వెళ్ళాడు. తనకోసమే ! అతని బిడియం తలుచుకున్నప్పుడు గుండె పట్టుకున్నట్లు వుంటుంది. అతనువెళ్ళిన తోవవెంబడి ఆ గుట్టవేపు వెతుకుతోంది—ఆ గునపమూ అవీ కొని తీసుకొనివస్తే కొంచెం, తోవలో సాయం చెయ్యవచ్చునుగదా అని. సరిగా ఆమె ఆగుట్ట యెక్కేటప్పటికే దూరంగా వొకమనిషి వొస్తూ వుండడం కనపడ్డది. సర్వభద్రమే ! తొరగాదిగి నడిచి అతన్ని కలుసుకుంది. ఒక గడ్డపారేకాదు. అతను తప్పకుండా రావాలని కోరుకొంటోందా ? యేమో ! గొప్పబాధ యేమీ లేదుగాని, ఆ పొలం మధ్య ఆ సన్నని పెద్దమూటా, ఒక బిండె పట్టుకొస్తు న్నాడు.

“అబ్బా ! యివన్నీ యేమిటీ ? ఏమిటీ ఖర్చంతా !” అంది.

“ఏముంది ! ఈకాస్తకే !”

"శాస్త్రా! యీబిందె యేమిటి? ఇదంతా నాకోసమే! ఈ బీదరాలి కోసమే! ఆ దణ్ణెంమీద ఆపట్టుచీరె యేమిటి? ఏ మనాలో నాకు మాటలు తెలీటంలేదు."

ఆబిందె, మూటా కూడా తనే తీసుకుంది మొయ్యటానికి. పిల్లలకి కమూటలోంచి లడ్లూ, బిస్కట్లూ, తీసియిచ్చాడు. ఆమెకో జాకట్టు కొన్నాడు. ఆమెకి గరిటెలు, పెనం ఎట్లా కని పెట్టాడో—ఇంట్లో యేవేవిలేవో జాగ్రత్తగా చూసి కొనుక్కొచ్చాడు. ఇల్లంతా ఆనందంతో నిండిపోయింది. అందర్లోకీ ఆనం దం అనుభవిస్తున్నాడు సర్వభద్రం. స్నానం చేస్తున్నప్పుడు పొడి బట్టలు తీసుకుని అతని కంత దగ్గరగా నుంచోడం అవసరంకాదు కాని బుజాన్ని ఆజుట్టు తగులు తున్నట్టుగానే వుంది అతనికి. మధురమైె వృష్ణం వొళ్లంతా పరిగెత్తింది—శ్వాస ఆగింది అత నికి. భోజనం వొడ్డించింది గాని అతను తినలేకపోయినాడు. కొంచెం పులుసుతో తిని తను తెచ్చిన లడ్డే ఆమె వొడ్డిస్తే అవి తిన్నాడు. ఆమె పెరుగు తేవడానికి వెళ్ళగా ఆమె తాగిన చెంబు తీసుకుని, ఆమె పెదవు లంటినచోట, తన పెదవుల్ని వుంచి తాగాడు.

బాగా రాత్రి పొద్దుపోయింది. పడుకోకముందు వాళ్లిద్దరూ విచార మనుభవించాలని వ్రాసివుంది గావును!

"నా కేమన్నా వుత్తరం వొచ్చిందన్నారా?"

"అవును వొచ్చింది ఇయ్యడంమరచి పోయినాను."

ఆ పై దస్తూరి చూడగానే ఆమె ముఖం ముకుళించింది. ఉత్తరంవిప్పి చటాలున—"ఆయన దగ్గిర్నించి" అంది. ఆమె చదువుకుంటోవుంటే, సర్వభద్రమూ పిల్లలూ, ఆమెవంకనే చూస్తున్నారు. మొదట ఆమె ముఖం భయంతో తెల్లనయింది.

తనుపంత ఆశ్చర్యంతో—"ఎంత అదృష్టం ! నిజమేనా ! నిజమేనా !" అనుకుంది తనలో తను.

"మీ ఆయన దగ్గిర్నించేనా !"

"అవును" అంది సంతోషంతో వొణుకుతో—"పాపా, మీ నాన్న వొస్తున్నారు. తెలిసిందా ? మీ నాన్నగారు వొస్తున్నారే పిల్లా !"

"మరి ఆ వుత్తరం రాజమండ్రి నుంచి వొచ్చిందే నేను చూశాను."

"రాజమండ్రి నించా ! కాదు—అవును అనేక దేశాలు తిరిగి రాజమండ్రి వొచ్చారట అవును. బిళ్ళమీద వూరిపేరు ముద్రకొడతారుగా ! ఒక సంవత్సరం ముందుగానే వొస్తున్నారు. మీరు అమరావతి మీదుగా వెళ్లటం అదృష్టమే ఎందుకంటే ఆయన రాజమండ్రిలో కొన్నాళ్లువుండి కొంచెం అలవాటు చేసుకుని—అంటే అదే మన దేశాచారాలకి కొంచెం అలవాటైవొస్తారుట." అంటోనే అప్పుడే ఆగది అంతా తనకి తెలీకండా తానే సర్దడం మొదలుపెట్టింది. సర్వేభద్రం వొక్కడూ అట్లా నడుస్తో నదివొడ్డుకిపోయి కూచున్నాడు. ఇంక ఇక్కడ తనకేం పని ? ఆ గడ్డపలుగెందుకు ? ఆ రాళ్లు తవ్వడమెందుకు ? పిల్లలు పడుకుని వుంటారనుకుని వెనక్కి వొచ్చాడు. ఆమె బైలునే నుంచునివుంది.

"మళ్ళీవోసారి చదివాను ఉత్తరాన్ని ఏనాడన్నా రావచ్చు రేపే వొచ్చినారావచ్చు."

అతను పడుకోటానికి వెడుతోవుంటే రోజూవొచ్చినట్టు ఆమె వెంటరాలేదు. ఆమె పూర్తిగా మారిపోయినట్టుంది. ఏవో తన ఆలోచనలతో మునిగి అతన్ని మరచిపోయినట్టేవుంది. వెనక్కి

తిరిగి చూశాడు. ఎట్లాగో ఆలోచిస్తూ అక్కడే నుంచుని వుంది. అతనికి బాధగావుంది. గాని ఆమెని రమ్మని అడగదలుచుకో లేదు. ఆమెమీద కోపంతో, హృదయంలో పొంగివచ్చే విచారంతో పడుకున్నా డాపాకలో. కాని కాసేపట్లో వచ్చింది మంచంపక్కన కిందకూచుంది. ఆమె వాలకంచూస్తే అతన్ని గాయపరిచాననుకుని పశ్చాత్తాపంతో వచ్చినట్టు కనపడ్డది.

"మీరంత విచారపడకూడదు ఏంచేస్తాం ? విధి ! మరచి పోగలరు మీరు—కొత్తలో యిట్లానే బాధగావుంటుంది గాని తరువాత అంతకష్టంగా వుండదు. నేనా ? ఇదివరకంతా యెట్లా వున్నాను, అట్లానే వుంటాను. ఆయన వెళ్ళిపోతే యెట్లా బతికాను ! ఏదో ఆయన వంశానికీ, నా వంశానికీ కీర్తిగా వుండేట్లు ఆపిల్లలిద్దరికి ఏదో యింత ఆస్తి మిగల్చాలని బలం తెచ్చుకుని వున్నాను. అట్లానే గడుస్తుంది కాలం ఎన్నాళ్ళుబ్రతుకు !" అంటూ ఎంతో వైరాగ్యం అతనికి బోధించింది. సర్వభద్రం ఒకమాటా మాట్లాడలేదు.

"అంతకన్నా ఏముంది ? ఎట్లా జరగాలనివుందో అట్లా జరుగుతుంది. కాని అకారణంగా మీరు నామీద చూపినదయకి—నాకు చేసిన మేలుకి—మీకెంతో ఋణపడియుంటాను."

"ఏం చెయ్యాలో నాకు తోచటంలేదు." అన్నాడు.

"మీరా ? మీకేం ? నేనుకాకపోతే యింకోరు. నన్ను కావాలంటే ఎట్లా ? నేను పెళ్లి ఐనదాన్ని. ఇంకోరి భార్యను మీదాన్నెట్లా అవుతాను ? వెర్రి ! అట్లాంటి ఆలోచనలు మరిచిపోండి." అని వెళ్ళడానికి లేవబోయింది.

అతని మనస్సు గాయపడ్డది. అతని న్యాయ అన్యాయ విచక్షణ పోయింది. తనకి బాధ కలిగించిందనే ఆలోచనే ఏపట్టుండే

యీ మనిషికి ! తను వున్నానరే, వెళ్లినానరే, చచ్చినానరే ఒకటిగానే వున్నట్టుందే ! ఏమిటో ఆడమనిషిసంగతి ! ఏం ఆడది! ఆమె నుంచోగానే తనచేతుల్ని ఆమె నడుంచుట్టూవేసి, తన మీదికి లాక్కున్నాడు. తనంటేనే లక్ష్యంలేదు యీామెకి !—ఆ మొగుడు వుత్తరం రాశాడో, లేదో తనని బైటికి లాగేసింది— తనని అతి నీచంగా మోసంచేసింది—ఐనా ఆమె కావాలి అతనికి.

"నామీద మనసులేదు" అన్నాడు.

"వుంది ! వుంది ! అమ్మో నాకు మనసు లేదా ? మిమ్మన్ని అందరికన్నా—మిమ్మన్ని ఎంత, యెంత, తలుచుకున్నాను ! ఎంత అందమైనవారు మీరు !—ఎంత నిర్మలంగావుంటాయి మీ కళ్ళు ! ఇంకేమి చెప్పమంటారు ? ఏం చెప్పమంటారో చెప్పండి—చెపుతాను. కాని మరి పరిస్థితు లెట్లావున్నాయో చూడండి—ఇంకేంలేదు మీారోపిల్లని చూచుకోండి చక్కని పిల్లని—ఏంచెయ్యను ? నేను సంసారిని ఏంచెయ్యగలను ?— మనకోర్కెలెట్లా వున్నా—"

"పోనీ అతనువొస్తేనేం ? నేనువుంటేనేం ? వీల్లేదులే— లాభంలేదు."

"ఇక్కడా ? వొద్దు."

"పోనీ యీ చుట్టుపక్కల—అమరావతిలో"

"వొద్దు వొ—ఆ ఆలోచనేవొద్దు. ఆయన తప్పకుండా కనుక్కుంటారు."

"రా—ఐతే అతనిమీదేవుంది నీ మనసు ఏం ?"

"అవును కాని మీరు చేసిన వుపకారం మాత్రం నా జీవముండగా మరచిపోను."

కదలకుండా ఆ పక్కమీద పడుకున్నారు కొంతసేపు. తరవాత దగ్గిరికి వొత్తుకుని ఆమెని ముద్దుపెట్టుకున్నాడు. ఆమె యేమీ అభ్యంతరం చెప్పలేదు. సిగ్గుగా, మోటుగా, ఇంకా యెక్కువ ప్రయత్నించబోతే, ఆమె—"అమ్మో! వద్దు, నాకు భయం" అంది. విచారంతో కుంగిపోయి, అభిమానం గాయమై, ముఖం ఆమె రొమ్ముకి ఎదురుగా పమిటపైన దాచుకున్నాడు. అట్లా కొంతసేపు కదలకుండా పడుకున్నాడు. ఆమెగుండె గడగడ దడదడ కొట్టడం వింటున్నాడు! పమిట తొలగించి ఆమె అతని తలని తన చేతులమధ్య గట్టిగా పట్టుకుని ముద్దెట్టుకుంది. అతని నోటి దగ్గిరే, కెంపెదవులమీదనే. "ఏం? నేను ధైర్యంచెయ్యలేనా?" అనుకుంది. 'అవును ధైర్యంచేసింది. అతని మీద మాతృభావం వల్లనో, జాలివల్లనో, ప్రేమవల్లనో, దేవుడికి తెలియాలి—అతనికి దోవజూపి ప్రవేశపెట్టింది. వాళ్ల ఉద్రేకానికి పరిమితి లేదు.

ఆ ఆవేశం అనేకగంటలు అనుభవించారు—ఒకరిమీద ఒకరికి తీవ్రమైన కాంక్ష, ఏమీ చాతుర్యాలు లేవు. అతని కామం ఎంతకీతీరదు. ఆరదు. ఆమె దయతలచమని అతన్ని ప్రార్థించలేదు ఒక్కసారికూడా! తెల్లగా కాంతివొచ్చిన తరవాత అతని దగ్గిర్నించి లేచివెళ్లింది. కాని యీ పరిస్థితివల్ల యిబ్బందులు యెక్కువైనాయి గాని, తగ్గలేదు. కొంచెంసేపు నిద్రపోయినాడో లేదో, ఆమె తిరిగివొచ్చి లేపింది.

"ఆయన వొస్తారని భయంగావుంది."

"రాని" అన్నాడు నిర్భయంగా.

"కాదు, కాదు. ఆయన వొచ్చేప్పటికి నువ్విక్కడ వుండకూడదు."

ఆమెకోసం చేతినిజాచి ఆమెను దగ్గిరికి లాక్కున్నాడు మళ్లీ

యింకోసారి ఆమెని కోరాడు. కాని వొల్లకాదంది. ఆమెని ప్రార్థించాడు—"చివరసారి కద ! ఇంక యింతేకద !"

ఆమాటలకి ఆమె నవ్వి, ఏదో గొప్ప వాత్సల్యంతో అతన్ని ముద్దుపెట్టుకోక తప్పిందికాదు—అంతకన్న మూర్ఖమైన పని లేదు.

"అబ్బా ! ఎంతభూర్తుడివి ! ఏంగోల చేస్తున్నావు !"

వొప్పుకుంది. ఇంకాబాగా యెండరాలేదు. పిల్లలు లేవనే లేదు.

సర్వభద్రం కొంచెం రొట్టెతిని వేడి అంబలి తాగాడు. తన సంచి సర్దుకున్నాడు.

"నేను వొచ్చినరోజు యీసంచి తేలిగ్గా తోచింది. సామానులు తక్కువైనా మహాభారంగా తోస్తోంది ఇప్పుడు."

"గడ్డపలుగు తీసుకువెళ్లు."

"ఏమి ?"

"తక్కినవస్తువుల్ని నేనే కొన్నానంటానుకాని అపలుగు—"

"పిల్లలు చెప్పరా, నాసంగతి ?"

"పనికి మనిషిసి పెట్టుకున్నా నంటాను. ఆ గడ్డపలుగుకూడా తీసుకెళ్లు."

"కాదు, దాంతో ఆ పెద్దరాళ్లన్నీ తవ్వించు మీా ఆయన చేత. ఇదివరకు గడ్డపలుగు లేదని తప్పించుకుని వుంటాడు."

"సరే గడ్డపలుగు పనిమనిషిది, వొదలిపెట్టి వెళ్ళాడంటాను."

శెలవ తీసుకుంటున్నాడు. ఆమె పెదవులచుట్టు వొణుకుతోంది.

"ఇంక యీా జీవితంలో మిమ్మన్ని చూడనుగావును."

"ఏమో ! నేను వుండాలని వుందా ?" అన్నాడు.

"ఆ ! చాలావుంది."

తొందరగా ఆసంచి పట్టుకుని ఆనందంతో వెళ్లాడు. ఆమాట చాలు, ఆ కుర్రాడికి ఆనందం కలగడానికి. ఆమె యింటిముందు చూస్తూనే నుంచుంది, అతను అదృశ్యమయ్యేవరకూ.

3

దీపావళిపండగలకి కొత్తబట్టలన్నీ తెప్పించారు. మార్వాడీ బట్టలకొట్టులో పని యెక్కువగావుంది. ఖరీదు మార్కు చెయ్యడం, బేలులు విప్పడం—సర్దడం—రెండేళ్లమట్టీ గుమాస్తాగావున్నా సర్వభద్రానికి అలవాటుకాలేదు. పనిమీద శ్రద్ధవుండకపోవడం వల్లనో యేమో! గుంటూరు వచ్చినప్పుడు చుక్కమ్మా భర్తా బట్టలు యీ షాపులోనే కొంటారని ఆమె చెప్పింది. జ్ఞాపకం వుంచుకొని, అక్కడే గుమాస్తాపనిలో కుదిరాడు. రెండేళ్లయింది. వాళ్లనిచూడ లేదు. సీనయ్య వచ్చి ఆమెతో కాపరం చేస్తున్నాడని తెలుసు. సీనయ్యా పరదేశాలు పోలేదనీ, యిన్నాళ్లూ రాజమండ్రి జైలులో వున్నాడనీకూడా తెలుసు నతనికి. క్రమంగా చుక్కమ్మమీది ఆశ అట్టే బాధించటం మానినా ఆపని బాగానే వుంది. అట్లానే వుండి పోయినాడు. ఎన్నాళ్లావుంటాడో ఎక్కడికి పోతాడో, ఎవరికి తెలుసు ? అతనిదగ్గిర డబ్బుచేరింది. మంచి బట్టలు కుట్టించాడు. వేళ్లకి వుంగరాలు, చెవులకి అంటుజోళ్లు—చూడ్డానికి ఆస్తి పరుడిలాగు కనపడుతున్నాడు.

దీపావళి నాలుగురోజులుండనగా గావును చుక్కమ్మా, సీనయ్యా వొచ్చారు. అన్నిమైళ్లూకూడా బండీ బస్సూ లేకుండా నడిచేవచ్చారు. చుక్కమ్మ బట్టనిండా, కాళ్లనిండా, తెల్లటి రోడ్డు దుమ్ము. జాకెట్టువేసింది. బంగారుగాజులు, పైగా ఒకపిన్నూ పెట్టింది. ఎవరినో కొత్తమనిషిని చూచినట్టుంది సర్వభద్రానికి.

సీనయ్యా, ఆమె చెప్పినట్టు అందమైనవాడే, కాని యీ జాకెట్లూ, రెవికలూ తొడిగితే ఆమె యేమీ బాగాలేదు. "ఏమిటీ, మీా రిక్కడున్నారా ?" అంది ముందు చుక్కమ్మ. ఏమీా బిడియం గాని భయంగాని, లేకండా సహజంగానే మాట్లాడింది. ఆమెని ఏ చలనమూ లేకండా చూచిన సర్వభద్రం, ఆకంఠం వినేప్పటికి తబ్బిబ్బులైనాడు. ఏమేమి జ్ఞాపకము వచ్చాయో ! బాగా చూశాడు. తనిచ్చిన పట్టంచుచీరనే కట్టుకుంది. "ఆయనెవరు ?" అన్నాడు. పెనిమిటి అని ఆమె చెప్పింది. సీనయ్య క్రోధంతో నిండిన కళ్లతో అతని వేపు తిరిగి—"నేను లేనప్పుడు మా పొలంలో పనిచేసింది నీవేనా ? ఏంముట్టింది ?" అన్నాడు.

"ముట్టడమా !"

"అదే అడుగుతున్నాను."

"భోజనం."

"అవును భోజనము మనింటోనే పెట్టాను." అంది చుక్కమ్మ.

"భోజనం ! వృత్తభోజనమేనా ?"

"అంతకన్న నేనడగలేదు. అది దొరకడమే కష్టమనిపించింది కష్టదశలో."

సీనయ్య దానికి జవాబు చెప్పలేక భార్యవంక తిరిగి "ఏమిటి, యీమనిషి యేమన్నా పనిచేసి వుంటాడా ? చాలా షోకిల్లాలా గున్నాడే !" అన్నాడు.

"ఊరుకోండి" అన్నది నెమ్మదిగా. బట్టలు కొన్నారు. సర్వభద్రం పిల్లలు ఎలాయున్నారని కనుక్కున్నాడు.

సీనయ్య అతనికి తెలిసిన మనుష్యులతో మాటలాడుతో దూరంగా వెళ్ళాడు. చుక్కమ్మ యింకా యేదో బేరమాడు

తున్నట్టు సర్వభద్రం దగ్గిరికి వొచ్చింది. కాని బట్టలబేరమేకాని యింక ఒక్కవిషయం యేమీ మాట్టాడుకో లేదు. ఏదీ పూర్వపు ఆకర్షణ! ఒకరిమీద ఒకరికి యెంత అనురాగం వుండేదో మరచిపోయినారా? చివరికి సర్వభద్రం "సుఖంగా వున్నావా?" అన్నాడు.

వెనక్కి చూసి— "బైటికివెళ్ళివుంటారు—ఆ, సుఖంగానే వున్నాము."

"నేనీవూళ్ళో వున్నానని తెలుసా?"

"నేను వెళ్లాలి ఆయన వూరుకోరు."

"వుండు—విను—చుక్కమ్మా, రెండేళ్ళమట్టీ నువ్వు కనపడతావనే ఆశతో యిక్కడవున్నాను."

తల వూయించింది. లాభంలేదన్నట్టు.

"నీకివ్వాలని ఒకవస్తువును ఎన్నాళ్లనించో దాచివుంచాను."

"ఆయన సంగతి మీరు తెలుసుకుని వుంటారు. అవునా?"

"ఊఁ"

"కైదులో అందరికన్నా బుద్ధిగా వున్నారుట. అందుకని శిక్ష సంవత్సరం తగ్గించారు. అట్లా ఎవరికీ, యెంత గొప్ప వారికీ తగ్గించరుట!"

"అహా!"

"యిప్పుడైనా ఆతాగుడు మానితే—"

"ఎవరితోనో—ఆ గొల్లదానితో మాట్టాడున్నాడే యిందాక! ఏమన్నాదాన్ని వలలో వేసుకున్నాడా ఏం?"

"నాకు తెలిసినమనిషే? అదేఅని ఏమిటి? ఆయన వెంట బడేవాళ్ళలో యిదోగొప్పా?" అంది గర్వంగా.

"గంగలో పడనీ—ఇదిగో, యిది తీసుకో."

"వాడ్ని—నా కేసి రానివ్వొద్దు. భయం. వుండండి. ఎవళ్లెక్క డున్నారో చూసివస్తాను."

అతను ఆమెను వద్దనలేదు. ఎక్కువ బాధగానూ లేదు—పగీ,—ఆ పూర్వపు ఆకర్షణ—కాని తనని యింత చులకనగా ఆమె చూడడం—అతనిమనసు చాలా బాధపెట్టింది. ఎందుకూ కొరగానివాణ్ణి చేసినట్టయింది. పీటమీద చతికిలపడి కూచున్నాడు.

"వాడిలేసాడు దాన్ని. ఎవరితోనో మొగాళ్ళతోనే మాట్లాడుతున్నాడు. ఏదీ ? ఇందాకటి పట్టుజాకట్టుబట్ట చూపించండి."

బట్టలు ఒకటి తర్వాత ఒకటే చూసాడు. ఖరీదులు చెప్పాడు. పైగా ఒక్కమాట మాట్లాడలేదు. వెళ్ళి పెనిమిటిని తీసుకొని వచ్చింది డబ్బు యివ్వడానికి. తాగినట్టు కనపడుతున్నా డతను. అతనూ బేరమాడుతో మధ్య,

"నిజంచెప్పు నాయింటో నువ్వేం తప్పుపని చెయ్యలేదుకద" అన్నాడు.

సర్వభద్రం మాటాడలేదు.

"కానీండి, పోదాం" అంది చుక్కమ్మ.

"నువ్వేబట్టలు కావాలంటావో చెప్పు"

"ఇది—"

"కానీవయ్యా ! ఇది నాలుగు గజాలియ్యి. నేనువోదిలి పోతాను. నీగుండె స్థిమితపడుతుంది. కాదా ?"

సర్వభద్రం మాట్లాడలేదు.

"పోసి ! యెంతయివ్వాలో అదన్నా చెప్పు."

చెప్పాడు.

"ఖరీదుమాత్రం బాగానే తెలుసు. కాని ఇంకేమన్నా అడి

గితే నోట్లో నాలిక లేనివాడిమల్లే నుంచుంటాడు. మనపాలం పని చేసేటప్పుడూ యిట్లా మూగిగానే వుండేవాడూ ?"

"వూరుకోండి."

"మరి అట్లా బెల్లంకొట్టిన రాయిమల్లే నుంచుంటాడేం? అడిగితే మాటాడకూడదూ ? నేనెప్పుడు నాపనిఅంతా చేసి పెట్టాడుకదా ! కొత్తవాడా, ఏమన్నానా ?"

"డబ్బియ్యండి. పొద్దెక్కుతోంది వెడదాం."

డబ్బిస్తో—"ఏమన్నా అపచారంచేశావా, చెప్పు" అన్నాడు. సర్వభద్రం యెవరికో బేరంచూపడం ప్రారంభించాడు.

౮

సాయింత్రం అతను కాఫీతాగి వొస్తోవుంటే చుక్కమ్మా, యింకా యెవరో ఆడవాళ్ళూ వూసబదుకాణందగ్గర వున్నారు. ఇంకా వెళ్ళలేదావాళ్ళు ! ఎందుకు ఆగి మాట్లాడ్డం ? ఏమీ లేదు. మాట్లాడవలసింది ఏమీలేదు కాని ఆమె, అతన్నిచూసి, ఆగింది.

"రాత్రి భజనవుందిట. ఇక్కడే వుంటాం. ఏమిటి అన్నారు యిందాక ? నాకేమో యియ్యాలని వుందనా ? కాని నాకు భయం. నామీద దయ యింకాపోలేదు మీకు. అదిచాలు నాకు. నేను తీసుకోను. నాకు ధైర్యం లేదు. ఏమిటి యివ్వాలనుకున్నారు ? చెప్పరాయింక ! మీపటమేమో అనుకున్నాను."

"పటమిస్తే తీసుకోడం యిష్టంలేదా ?"

"వుంది. కాని—"

"నాపటం కాదు. నాఫోటో తీయించుకోలేదు."

"మీరు నామీద యెంతదయగావున్నారో దేవుడికి తెలియాలి."

"దయయేమిటి ! నా హృదయ మంతటితోనూ నిన్ను మోహించాను."

దిగులుగా తల వూయించింది.

"నీ అందమంతా నాకిచ్చినసంగతీ మన ఆనందమూ, అన్నీ మరిచావా ?"

"ఆయనొస్తారు" అంది చుట్టూ భయంతో చూస్తూ.

"ఐనతరవాత ఆపొద్దున్న నువ్వేమన్నావు ? జ్ఞాపకంలేదా, అదికూడా ?"

"ఏమన్నాను ?"

"నేనుఅట్లా నీతోవుండాలని వుందనలేదూ ?"

నిట్టూర్పు విడిచింది.

"మరి ఆయన వస్తున్నారయ్యోను ! ఏంచెయ్యను ? మీ రక్కడ వుండటానికి మీ కెట్లావుంటుంది ? మనిద్దరికి ఎట్లాసాగుతుంది—నేనువెళ్ళాలి."

"సరే—వెళ్ళు, నీ పెనిమిటి దగ్గిరికి సుఖంగా వెళ్లు" అన్నాడు హృదయం బద్దలైనట్టు.

"మీరనుకున్నంత చెడ్డవాడు కాదు. ఎందుకు—ఆయనతో చక్కగా మాటాడి స్నేహంగా జవాబు చెప్పవలసింది మీరు."

సర్వభద్రం మండిపడ్డాడు.

"నేను మీవాడికి సరిగా జవాబు చెప్పను. నాకేం ? కాని, నా చేతికి చిక్కనీ, వాడి పని తెలుస్తుంది."

"ఆ, ఆ, ఏమిటి ? ఆయనతో తగాదా పెట్టుకోరుకదా ! నాకు చాలా భయంగా వుంది."

"నాకు తెలుసులే, దొంగపోటున కత్తితో పొడుస్తాడని ! అందుకేగా కైదుకు పోయినాడు."

"అప్పుడు తాగి వెళ్ళి వళ్ళు తెలీక పొడిచాడు. అదికూడా నాకోసమే ! ఆసంగతి చెప్పారా ఎవరన్నా మీకు ? చంపా లనుకోలేదు. చచ్చినవాడూ, చావబోయ్యేముందు ఆమాటే అన్నాడు"

"ఏమిటి, నీ మొగుడి సంగతి నీతో మాటాడుతో నుంచో డమే నా పని అనుకున్నావా ఏమిటి? యిదిగో వాడు నా కాలి వెంట్రుకమాత్రం చెయ్యడు. కావలిస్తే యిట్లా అన్నానని చెప్పు."

"చూడండి ఇదివరకటి దయే నామీద చూపాలి. ఎందుకీ క్రోధం ? నామీద యీ మమకార మేమిటి ? తొరలో మీకు పెళ్ళి అవుతుంది. నన్ను మరిచిపోతారు... అదిగో వొస్తున్నారు" అని భయంతో తిరిగి వెడుతోంది.

సీనయ్య ముందు వొస్తున్నాడు. వెనక అతనితో వచ్చిన కాపువాళ్ళు మూటలు పట్టుకొస్తున్నారు. అతను చుక్కమ్మకేసి వొచ్చాడు. ఏమిటో ఆమెతో మాటాడి సర్వభద్రం కేసి దూకాడు. రెండు నిమిషాల్లో సర్వభద్రం అతన్ని దవడమీదా, పొట్టలోనూ కొట్టి కింద పారేశాడు. మూటలు పారేసి ఆ కాపులు చుట్టూ పోగైనారు. వాళ్ళవాణ్ణి కొట్టాడని కోపా లొచ్చాయి. కాని వాళ్ళకి సంగతి యేమిటో యింకా తెలీదు. అదిగాక పట్టణంలో వారికి బెదురుగా వుంటుంది. ఇదే వాళ్ళ వూళ్ళో ఐతేనా—చుట్టూ మూగారు. సర్వభద్రం అట్లానే నుంచున్నాడు—సీనయ్య నవ్వాడు ఏమీ జరగనట్టు. చుక్కమ్మ అతని బట్టనించి మొహంనించీ దుమ్ము దులిపింది. "ఇంతటితో కాలేదు. చూసుకో" అని వెళ్లిపోయినాడు. మర్నాడు బట్ట లమ్ముతో వుండగా మళ్ళీ చుక్కమ్మ సీనయ్య వొచ్చి బట్టలు బేరమాడుతున్నారు. కొంచెం సేపట్లో ఆ గొల్లపిల్లకూడా

వచ్చింది. సీనయ్యను చూస్తే సర్వభద్రానికి జాలివేసింది, అతని మొహం చూసేటప్పటికి. అతనికి తనమీద అనుమానం వుండడం అన్యాయమా ? అతని స్థలంలో తానువుంటే అనుమానపడడా ?

ఆమె పెనిమిటి వచ్చేవరకూ, నెలరోజులపైన ఆమెయింటో తానువుండలేదా ? మరి అనుమానపడతాడనడం అన్యాయమా ?

“నిన్న రాంభజనకు నేను రాలేదుకద.” అన్నాడు గొల్లదానితో సీనయ్య.

“అవును రాలేదేం ?”

“ఆ వుంగరాలు పెట్టుకున్న వాణ్ణి అడుగు”

“అబ్బ ! తగాదా ప్రారంభమా ? వూరుకోండి” అంది చుక్కమ్మ.

“తగాదా అయిపోయిందనుకోకు. ముందుంది పండుగ” అన్నాడు సర్వభద్రంతో.

“రండి వెడదాము.”

“సరేలే ! నేను వాడిమల్లే శృంగారపురుషుణ్ణా ? ధనికుణ్ణా ? బట్టలషాపులో గుమాస్తానా ? నాచేతికి వుంగరాలున్నాయా ? నేనేంలెఖ్ఖ నీకు !”

“అబ్బా ! వూరుకుందురూ !”

సీనయ్య మాట నెత్తుకుని, వెనక్కితిరిగి, “నాపాలందున్నే పుడుకూడా వాడికా వుంగరాలున్నాయా ?” అని వెళ్లాడు.

%

కాలం గడిచింది. ఓర్రాత్రి సర్వభద్రానికి నిద్రపట్టలేదు. సీనయ్యా భార్యా వొచ్చారని విన్నాడు. సర్వభద్రం బెజవాడ

నించి గుంటూరువొచ్చాడు. ధరలు తగ్గాయి. ఏ పొలంలో పంటలు ఆపొలంలోనే మురుగుతున్నాయి. పూరికే యిస్తామన్నా యెవరూ కసుపుగాని, వేరుశనగల్ని గాని తీసుకోవటంలేదు. కాని యీ కాటకం సర్వభద్రానికంటలేదు. బాంకిలో నాలుగు వేల రూపాయలు నిలవచేశాడు. అవి కొట్టుకూడపెడితే మార్వాడీ అతనికి భాగమిస్తానంటున్నాడు. అతనికేం! పని బావుంది. తల్లిని చెల్లెళ్ళని తెచ్చుకోవాలి. పెళ్ళి సంబంధాలు వస్తున్నాయని వ్రాస్తున్నారు. కాని గుంటూరుస్కూల్లో చదువుతున్న ప్లీడరుకూతుర్నిచ్చేట్టున్నారు. ఆ రోజుల్లో ఆడపిల్లలకి మొగుళ్ళే దొరకటంలేదు. శారదాయాక్టువల్ల బి. ఏ, లే కావాలి అల్లుళ్ళుగా అనేపట్టుదల పోయింది. చుక్కమ్మసంగతి నిరాశచేసుకున్నాడు. కాని వాళ్ళవార్తలు వొస్తోనే వున్నాయి అప్పుడప్పుడు. ఈ మూడేళ్లూ బెజవాడ బ్రాంచిలో పనిచేస్తోవుండడంవల్ల మళ్ళీ వాళ్ళని చూడలేదు. గుంటూరు రాగానే విన్న సంగతేమిటంటే—సీనయ్యావాళ్ళూ యీ కాటకమువల్ల చాలా యిబ్బందులపాలైనారనీ, రెండు మూడుసార్లు. సీనయ్య అతనికోసం వచ్చాడనీ—తాను వూళ్ళోవుంటే యేదో పెద్దతగాదా జరిగేదే అనుకున్నాడు. ఇంకోసంగతి యేం విన్నాడంటే—నైజాములో సీనయ్యా పినతాత వున్నాట్ట. అక్కడ పొలాలు చవుకగా వున్నాయనీ, ఒక్క నాలుగువేలు పట్టుకువస్తే పెద్దపొలం కొనవచ్చనీ, అన్నాడుట. సీనయ్యా కుటుంబముతోసహా ఈదేశమే వొదిలిపోవాలని చూస్తున్నాట్ట. కాని యీకబుర్లన్నీ సర్వభద్రాన్ని పూర్వంవలె అంతగా బాధపెట్టలేదు. అతని ధ్యానం పాడు డబ్బుమీద, భాగత్వంమీద వుంది. మర్నాడు సీనయ్యా భార్యాబిడ్డల కొట్టుకువొచ్చి వెళ్లారని విన్నాడు. చుక్కమ్మ కనపడు

తుందా ఆతనికి ? కాని అతను వెతుక్కుంటూ వెళ్ళలేదు. ఇప్పు డతను అరండలుపేటకు తూర్పున చిన్నయిల్లు అద్దెకు తీసుకున్నాడు. వాళ్ళవాళ్ళకి తొరగావచ్చి వాళ్ళని గుంటూరు తీసుకెడతా ననికూడా వ్రాశాడు ఆవేళ.

చుక్కమ్మ తనకోసం వెతికిందా ? వాళ్ళిద్దరూ తగూలాడారా ? తనకోసం వచ్చిందా—వెర్రివూహాలు ! పెళ్ళిగాని సర్వభద్రాని కేం తెలుసు స్త్రీహృదయం ? వెళ్ళిపోయినారో వున్నారో ? వెళ్ళారు. నిద్రపట్టదెందుకు ? చుక్కమ్మా కారణం? తననిమరచి, వొదలిపోయి, సుఖంగావున్న చుక్కమ్మనే పట్టుకు వేళ్ళాడే తన మనసుని చూస్తే అతనికి చాల కోపంగావుంది. కాని నిద్రరాదు. ఎవరో తలుపుకొట్టుతున్నారు. చుక్కమ్మే అనుకున్నాడు. ఎందుకో కనుక్కోవాలి. కాని యింకెవరు ? తను మేలుకొని సిద్ధంగా వున్నట్టు యెందుకు తెలియచెయ్యాలి ? వెళ్ళి పడుకున్నాడు. పైగా—చొక్కా తీసి—ఇంకా తలుపుకొడుతున్నారు. సావకాశంగా లేచి తలుపుతీసాడు. చేత్తో లాంతరు పట్టుకొని చుక్కమ్మ · నుంచునివుంది. వెనుక ఎవరూ లేరు. "నువ్వా !" మాట్టాడకుండా లోపలికివచ్చింది. తలుపు వేశాడు. పక్కనే అతనిగదీ.

"క్షమించండి పొద్దుపోయింది. ఇప్పుడు నిద్ర లేపాను — కాదు, యింకా పడుకోలేదే మీరు !"

"ఇంత పొద్దుపోయి వొచ్చావెందుకూ ? విశేషమేమిటి ?" బొడ్డులోనించి కాయితమొకటితీసి చేతులో పట్టుకుంది.

"మూడేళ్ళకిందటికవ్వా లాపైనారు చాలా అందంగా వున్నారు. యీయిల్లు అద్దెకుతీసుకున్నారా—? ఎంత చక్కని గదో ? ఆమంచం, యీదీపం, బల్లా—ఏం అదృష్టమండీ !

మాయిల్లో! వుంది!!!"

"మరి యిట్లా వొచ్చావు, నీకేం యిబ్బందిరాదుకదా?"

"రాదు."

ఎంతో నెమ్మదిగా, అడకువగావుంది. ఇదివరకుకన్న మధురంగా, ఆకర్షకంగావుంది. ఏదో ఆవేశంతో వొణుకుతోన్న ఆమెపెదవులు యెంతో ప్రేమగొలుపుతున్నాయి. ఏంమాట్లాడతాడు? పిల్లలెట్లావున్నారన్నాడు. దగ్గిరికి లాక్కుని ఆమెను ముద్దుపెట్టుకున్నాడు. ఆమె ఎంతో దయతో అతనిచేతుల్లో యిమిడి అతని రొమ్ముకి దగ్గిరగా కరిగిపోయింది.

"చుక్కా" అన్నాడు పూర్వంమల్లే.

"నాకు మీతో పనివుండి వొచ్చాను. నామీద దయవుంచి వింటారా?" అని చెప్పటం మొదలు పెట్టింది.

ఎందుకొచ్చిందో, అతనిదివరకే వూహించాడు. ఆమె వాలకమే చూపుతోంది. కాని అతనిమనస్సు మాత్రంవేరే కారణాలమీద పరుగెత్తుతోంది. ఆపాలంలో బతకడం విసుకుపుట్టింది అమెకి. తనతోవుండాలనివుంది. ఏమైనాసరే. తనతోనే, ఆజన్మాంతమూ వుంటానని అడగటానికి వొచ్చింది. పిచ్చికలలు—ఆమెమాట్లాడుతోంది. తనఆలోచనలన్నీ కట్టిపెట్టితే మంచిది. ఏమంటోంది? ఆమె, ఆమె కుటుంబము నైజాము వెడతారట. అతను సహాయం చెయ్యాలి. తమ స్థితి చితికిపోయింది. వెడితేనేగాని బతుకు కష్టం. అక్కడ బతికిపోతారు; పిల్లలూ తనూ ఈనిరంతర దారిద్ర్యాన్నించి విముక్తి పొందుతారు. వూళ్ళో తెలిసినవారి నందరినీ అడగడమయింది. ఒకరూ దయదలచలేదు. ఇంక తనకి అతని కంటె ఎవరు ఆప్తులు? ఆమె అడక్కుండానే ఆమెకంతా [illegible]

తాను ప్రార్థిస్తోంది అతని పాదాలముందు. ఊరికే డబ్బియియ్యక్కర్లేదు. ఆకాగితం చూస్తేచాలు, తెలుస్తుంది. అంతా దాంట్లోవుంది- ఆపొలము, యిల్లూ అంతా తాకట్టు తీసుకుని వాళ్ళకి సహాయంచెయ్యాలి. ఈరాత్రే పరిష్కారంకావాలి వ్యవహారం.

ఇదంతా గుక్కతిప్పుకోకుండా చెప్పింది. ఎక్కడన్నా ఆగితే, అంతావినకుండా, అతను మధ్యలోనే వీల్లేదంటాడేమోనని భయపడ్డది. అతని చెయ్యిపట్టుకుంది.

తాను చాలాధనవంతుడైనాడని, వాళ్ళకి సహాయంచెయ్యడమంటే తనకు లెక్కగాదని, అనుకుని చుక్కమ్మ తనదగ్గిరికి రావడం, అతను చాలాగర్వపడ్డాడు. కాని తలవూయించాడు.

"సహాయంచెయ్యలేరా?"

"లేను"

"సరే, యింకేముంది? వొచ్చినపని అయింది." తన తల వంచుకొని ఆలోచనలో పడ్డది.

"ఇప్పటిమల్లేనే యెందుకు ఉండకూడదూ? పరదేశాలు పోవడమెందుకు? నువ్వూ—నీనేతా—అతను—మరి అతనేమీపని చెయ్యడయ్యేను!"

"కాదు. ఇక్కడ అందరూ అతన్నీ, అతని చరిత్రనీ యెరుగుదురు. అతను ఖైదులోపడ్డసంగతి మరచిపోరు. ఎవరూ మాకు సాయంరారు. ఇంతకీ అతనుచేసిన అపరాధం ఏమీలేదు. పైగా అది నాకోసమే చేశాడు. కాని ఆసంగతి యెవరన్నా యోచిస్తారంటారా? మమ్మన్నెవరూ ఎరగనిదేశం పోతే తప్పక బాగుపడతామంటారు ఆయన. అదిగాక ఇప్పుడాయన పూర్తిగా మారిపోయినారుకూడాను. అసలు వస్తుతహా బంగారంవంటి

మనిషి. ఇప్పుడు మునపటిమ్మల్లేకాదు."

"నేను గడ్డపలుగు వొదిలివొచ్చానా. దాంతో ఒక రాయన్నా కదిల్చాడా?"

ఆమె మాట్లాడలేదు.

"ఆగడ్డపార యెన్నడన్నా చేతపట్టాడా, అదిచెప్పు."

"లేదు అంతకన్నా చాల తెలివైన పనులు సులభంగా డబ్బు వొచ్చేమార్గాలు నేర్చుకున్నాడాయన. ఈదేశమే వొదిలి పోగలిగితే—"

"సరే వొంటరిగాపోయి సంపాయించుకోమను. ఏమి?"

ఇంత అసహాయస్థితిలో వున్నా చుక్కమ్మ ఆలోచనలకి లోటులేదు. చాల నమ్రతగా పాతివ్రత్యం వొలికేట్టు చెప్పింది.

"వీలులేదు. మరియింక బతికున్నంతకాలమూ పరదేశాల్లో గడిపితే పెళ్ళిచేసుకొని ప్రయోజనమేముంది? సుఖదుఃఖాలు పంచుకునేందుకేగా? నేనూ పిల్లలూ, తనదగ్గిర వుండాలంటాడు. న్యాయమూ, అన్యాయమూ, ఆయననేమాట? మేంలేకపోతే, ఏదో వొచిక్కులోకివస్తారు."

"నీవల్ల నిన్నువదలి బాధపడుతున్న యితరుల సంగతేమీ అక్కర్లేదు, అవునా? వాళ్ళెట్లాపోతేనేం! నీకేంలెక్క!"

"నాకు లెక్కలేదనకండి. ఎప్పుడూ దిగులుపడతాను." అని అతనిమీద ప్రేమతో వొరిగింది. "మీసంగతి తలుచుకొని విచారించని రోజేలేదు. కాని ఏంచెయ్యగలనో తోచదు. ఏంచెయ్యమంటారో చెప్పండి." చాలాసేపు వూరుకున్నారు.

"మీతోనేవుంటే ఎట్లావుంటుంది? అదిచాలా దోషమైనకార్యం. మనం దాచలేము. లాభంలేదు. ఆవిషయం వీలులేనిఅలోచన."

"అయితే నువ్వనేది—నాకింక నువ్వుకనబడకండా దూరంగా

పంపడానికి సాయపడమంటావా ?"

నాకు ఏమనడానికీ తోచటంలేదు." అని నిరాశతో మూల్గింది.

పమిటకిందనుంచి ఆమె జాకెట్టుమెడకింద గుండె విప్పారుకాని రవికి నెరుతో వుంటే, అతన్ని ప్రేమతో ముద్దుపెట్టుకుని దూరంగా వెళ్ళింది.

"తొందరా ?"

"కాదు. ఆయనికి తెలుసు నేనిక్కడ వున్నానని."

"నిజమే ! ఆతనికి తెలుసా నాదగ్గిరికి వచ్చానని ?"

"ఆయనే పంపారు. చూశారా ఆయన మీరనుకున్నంత దుర్మార్గుడు కాడు."

"దుర్మార్గుడా ! అంతకంటె అధముఁడు నీచుడు."

"కాదు. ఏమంటే—పాపం, చాలాకుంగిపోయి, నిరాశలో పడ్డారు. ఎక్కడా, ఎవరూకూడా, కొంచెం సాయంకూడా యివ్వలేదు. మాతోట తాకట్టు పెడతామన్నా ఎవరూ లెక్క చెయ్యలేదు— చూడండి—యీకాగితం చదవండి—మీకే తెలుస్తుంది—ఆయనన్నారుకదా ! నీకు తెలిసిన ఆయనేకదా ! ఇంక కడపటి ప్రయత్నం—ఆయన్నడిగి చూడమన్నారు. కాని అంతకన్న ఏమీజరగాలని ఆయన ఉద్దేశ్యంకాదు."

"ఆయన వుద్దేశ్యం ఏమైతేనాకేం—ఏమిటది ?"

"ఏమో !" ఎవరో వరండాలో నడుస్తున్నట్టు చప్పుడవుతున్నది. భయంతో చుక్కమ్మ వింటోంది. సర్వభద్రం లక్ష్యపెట్టలేదు.

"అసలుసంగతేమిటంటే — నామీద నీకు మనసు తిరిగిపోయింది."

"కాదు, కాదు. మిమ్మల్ని చూస్తే నాకు అమితమైన, చెప్ప లేనంత ప్రేమ— ఎవరో వొచ్చారు."

"నీకల్లా ఎట్లానన్నా అతనితో వెళ్ళిపోవాలనితప్ప యింకోటి లేదు. నీకా్కవలసిందంతా ఇంతే!"

"మరి యింతకన్న ఏంచెయ్యను? ముగ్గురు పిల్లలతోనూ —"

"ముగ్గురా యిప్పుడు!"

కన్నీళ్ళు కిందికివాల్చి "కొత్తపాప అతనిదికాదు" అంది నెమ్మదిగా. బైటపక్కనుంచెక్కడ అరుస్తోంది. మెల్లిగా తలుపు నెట్టుతున్నట్లూ, కిటికీలు తోస్తున్నట్టు తెలుస్తోంది. ఏమైనా అపాయం కావచ్చు. కాని ఆమాట విన్న తరవాత సర్వభద్రం యింకేమీ ఆలోచించే స్థితిలో లేడు.

"ఎట్లా తెలుసు?"

"నాకు బాగానే తెలుసు" అంది ఎక్కడోచూస్తున్న చిరునవ్వుతో. ఆలోచిస్తున్నాడు తీవ్రంగా. తలుపు తడుతున్న చప్పుడు విని కోపంతో— "ఎవరు" అని అడిగింది చుక్కమ్మ.

"ఎవరైతేనేం? వెధవముండని యెవరురమ్మన్నారు దాన్ని ఈరాత్రి!" సర్వభద్రానికి పక్కయింటి కోమటామెతో కొంచెం స్నేహమువుంది.

"నీకోసం ఎవరైనా వొచ్చిందా?"

"నాకు తెలీదు. ఈ పక్కయింటి కోమటిదనుకుంటాను,"

"కోమటిదా!" వెళ్ళిచూస్తాను. ఇక్కడే కూచో—కనపడవు." వెళ్ళితలుపుతీశాడు. ఎదురుగా సీనయ్య నుంచుని వున్నాడు.

"ఏంలేదు — ఇంకావుందా, యిక్కడ... నేను అప్పుడు మిమ్మనన్నమాటలన్నీ మరచిపొండి. నన్ను క్షమించండి."

సీనయ్యావాలా మారిపోయినాడు. అతనిని ఎన్నడు గొంతుకు పిస కాలాఅని చూసేవాడల్లా, చిరిగిన పేలికలు వేసుకుని ముష్టి వాడిమల్లే యాచిస్తో నుంచున్నాడు. తాగుడు వాసనేస్తొంది.

"ఎందుకొచ్చావు ?"

"ఎందుకా ? ఇక్కడే వుందాలది ? నేనుకూడా మీ పాదాల వద్ద ప్రార్థించాలని వొచ్చాను. కాని నేను వొచ్చానని చెప్ప కండి. వొక్కత్తా నీ మనసు కరిగించకలదో లేదో అని నేను కూడా వొచ్చాను.

"మళ్ళీవొచ్చిందాకా ఆంజనేయులు గుడిముందు కూచుని వుంటాను. మేము చాలాఅవస్తలో వున్నాము. మేంపోతాం. దయచేసి సాయం చెయ్యండి. ఆయిల్లూ, తోటా, పశువులూ, అన్నీ తాకట్టుపెట్టి కట్టుగుడ్డలతో పోతాం. కాయితాలు పంపిం చాను చదివారా ? మీకు చాలాలాభం ! నేను వొచ్చానని చెప్పకండి దాంతో. ఎవరోఅనండి. నేను వెడుతున్నాను. నా అపచారం క్షమించండి. కోపం కడుపులోపెట్టు కోకండి, బాబూ—" అంటూ నక్కి, దిగి, వెళ్ళిపోయినాడు.

"వెధవ ! నావొంటిమీద బట్టలు సరిగావున్నాయో లేదో చూడాలని వొచ్చాడు" అనుకుంటో లోపలికివెళ్ళాడు సర్వభద్రం.

"ముగ్గురుపిల్లలా ? ముగ్గురుపిల్లలనేనా అన్నావు."

"అవును."

"ఎప్పుడుకన్నావు ?"

చెప్పింది. "ఎవరు వొచ్చారు ?" అని అడిగింది.

"ముండని పంపించేశాను."

"నాకెంతో భయమేసింది—ఈమంచంవెనక దాక్కుందా మనుకున్నాను. రాత్రులు వొస్తోవుంటుందా ? ఇంకేం ?"

"ప్రతిరాత్రీ వొస్తుంటావా ?"

ఆమె యేమీ రోషంతో మాట్లాడలేదు, పూరికేఅడిగింది. ఆలోచనగా తలవొంచుకుని నుంచుంది.

"రాదు, ఎన్నడూ రాలేదు. ఈరాత్రి రావడానికి నాతో ఏదన్నా పనివుండివుండాలి. రా. మరిఅవి విప్పేసి యిట్లాపడుకో— చూడు, ఎంత అందంగావుందో యీపక్క !"

తలవంచుకొని విచారంగా అట్లానే కూచుంది.

"సరే— ఐతే నన్నువొదిలి దూరదేశం పోవాలనే ఆలోచన తప్ప నీకేమీలేదు."

"నిన్నువొదిలా ! కాదు నీతోనేవుండాలనీ, నాజన్మమంతా నిన్ను కనిపెట్టుకొని వుండాలని ఎంతోవుంది. ఈశ్వరసాక్షిగా చెప్పుతున్నాను— మీరునమ్మరు."

ఆమెనిచూస్తే అతనికి దిగులువేసింది. ఆమెకి అడిగినడబ్బంతా యివ్వడానికి వొప్పుకున్నాడు. తనని వొదిలిపోవడానికి రెక్కలు తానే చేయించాడు. అతను ఆమాట అంటోవుంటే తనకంఠస్వరమేనా అని ఆశ్చర్యపడ్డాడు. అవును, ఆ డబ్బంతా యిచ్చేస్తే తాను జోగిఐపోతాడు. ఇంక భాగత్వము యిల్లులేదు, బంధువులు, పెళ్ళి, ఏమీలేదు. మళ్ళీగుమాస్తాగా బతకాలి. కాని ఆమెకేం ? తాను వెళ్ళిపోతేచాలు తనసంగతి ఏమైతే ఆమెకేం! సరే తీసుకుపోనీ, వెళ్లి సుఖపడనీ, కష్టాలన్నీ తనే అనుభవిస్తాడు.

"ఏం ! తృప్తిఅయిందా ? అన్నాడు.

"అబ్బా" అని అరిచి అతనిమీదపడి గట్టిగా కావిలించుకుంది. ఆమెరొమ్ము ఎంతగాఢంగా వూగుతుందోఅతనికి తెలుస్తోంది. ఇదివరకన్నా ఎంతో ఆవేశంతో అతన్ని ముద్దుపెట్టుకుంటోంది. కృతజ్ఞత, ప్రేమ, దయ, అన్నిటితోకూడినముద్దు

పేర్లతో అతన్ని పిలుస్తోంది. ఆమెకి వొళ్లు తెలీని ఆనిమిషాన్ని పురస్కరించుకొని రెవికముడి విప్పాడు. ఆమె వెంటనే దిగులుగా యేడవడం మొదలుపెట్టింది. అతనికి ఆశ్చర్యం కోపమూ కలిగాయి. ఆమెని తననుంచి తోసేసి "సరే, నీయిష్టప్రకారమే కానీ" అన్నాడు.

"లేదు, లేదు మీరేం చెయ్యమంటే అట్లానే చేస్తాను. సహాయం చెయ్యండి చాలు" అంది.

"అదా సంగతి! దానికేం! నేను సహాయం చేస్తానని చెప్పాను కదూ! ఇదుగో, నా డబ్బంతా తీసుకో యిస్తున్నాను." అని కఠినంగా అన్నాడు. బల్లదగ్గిర కూచుని చెక్కువ్రాసి ఆమెచేతి కిచ్చాడు.

"చూసుకో"

"అక్కర్లేదు. ఎంత ?"

"నువ్వేచూసుకో"

"కాదునాయినా! నువ్వేచెప్పు."

"ఆరువేలు"

"అమ్మో! అంతే! నీపేరు రోజూ తలచుకుంటాము. నీకెంతో పుణ్యముంటుంది నీతల్లికడుపుచల్లగా! మాతోట చూచి ఎవరూ యింతడబ్బిస్తారనుకోలేదు. మరికొంత నువ్వే వుంచుకోరాదా ? అంతా మాకెందుకు ?"

"తీసుకో, మాట్లాడకు" అన్నాడు కఠినంగా. ఇప్పుడైనా ఆమె మోహం చూపుతుందనుకున్నాడు. కదలకుండా కాచుక్కూచున్నాడు కొంతసేపు. ఏంలాభంలేదు. దానిబదులు ఓకాయితమిచ్చింది, చదువుకోమని — తెల్లారి రిజష్టరి చేస్తానంది.

"రిజష్టరూ అక్కర్లేదు—ఏమీ అక్కర్లేదు." అని ఆశతో

కూచున్నాడు. అతని మనసులో యేముందో ఆమె కర్థమయింది.

ఏడుస్తో జాకెట్టూ, రెవికా తీసేస్తొంది.

"ఎందుకు ఏడుస్తావు—మునుపు ఏడవలేదే!"

"ఏడవటంలేదు. చూడు. తీసెయ్యటంలేదూ — ఒక్క నిమిషం —" కాని యింకా ఎక్కువగా ఏడుస్తోంది. నేలమీద కన్నీటి చుక్కలు పడుతున్నాయి. తనకిష్టమైనట్టే తను కోరుతున్నట్టే, కనపడాలని నటించడానికి ప్రయత్నించింది.

సర్వభద్రానికి చాలా బాధకలిగింది. లేచాడు. ఆ బట్టలు ఒకచేత్తో తీసుకుని, ఆమె చేతినిపట్టుకుని లేవనెత్తి— "తొరగా — చక్క తీసుకునివెళ్ళు. ఏం. నిన్నేమీచెయ్యను. వెళ్ళు."

అతనితో మోహంగా మాట్లాడి, అతని మనసు తనకోసంగా మార్చాలని చూసింది. కాని అతనే ఆమెకి బట్టలు వేస్తున్నాడు తొరతొరగా!

చెయ్యిపట్టుకుని వరండాలోకి తీసుకొచ్చాడు.

"నాచేతకాలేదు. మనసొప్పలేదు." అని యేడ్చింది.

"చాతకాలేదా ?"

"లేదు. ఈరాత్రివొద్దు."

"చాతకాలేదా ? ఆ — అంతానిశ్చయించుకొనే వొచ్చావన్నమాట."

"లేదు. నేను వొప్పుకున్నాను. కాని ఆయన మీ దగ్గర పడుకుంటే మీరు వొప్పుకుంటారని నన్ను బలవంతపెట్టి పంపారు."

"మరి యీ సంగతి ముందే ఎందుకుచెప్పలా నాతో."